భూ ఆధార్ నమోదుతో సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-కోటవురట్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రతి రైతు భూ ఆధార్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిని బి. సరోజినీ అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి ఆమె చౌడువాడ రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకి జతపరిచిన ఫోన్ నెంబర్ రైతు సేవ కేంద్రానికి తీసుకువచ్చి భూ ఆధార్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేయించుకోవాలన్నారు. భూ ఆధార్ నమోదైన ప్రతి రైతుకి 11 అంకెల గల సంఖ్యతో ఐడి నెంబర్ రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. ఈ రిజిస్ట్రేషన్ అయిన రైతులు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా అందించే సంక్షేమ పథకాలు పొందగలన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

14న అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-సబ్బవరం: మండలం లోని సబ్బవరం డి-2 సెక్షన్స్ పరిధిలోని 33/11కెవి అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పిఎంఐ వర్క్ కారణంగా ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగు తుందని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతకాపల్లి సబ్స్టేషన్స్ పరిధిలోని అలాగే అంతకాపల్లి ఫీడర్ పరిధిలో అంతకాపల్లి, రావులమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మ పాలెం, రాయపురాగ్రహారం, అరిపాక, బంగారమ్మ పాలెం, అద్దురు, గొట్టివాడా, లగిశెట్టిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగునని ఆయా గ్రామాల పరిదిలోని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగ దారులు అందరూ సహకరించవలసిందిగా కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పాయకరావుపేట : జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్. భానుమూర్తి తెలిపారు. జి. సాయి అనీష్ 98.52 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. 90 పైన పర్సంటైల్ సాధించిన విద్యార్థులు 20 మంది ఉన్నారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేతలు సిహెచ్.వి.కె. నరసింహారావు, సిహెచ్.విజయ్ ప్రకాష్ అభినందించారు.

లింగంపేటలో గుర్రాల పోటీలు

విశాలాంధ్ర-నాతవరం : శ్రీమహాలక్ష్మి అమ్మవారి పండుగ సందర్భంగా గ్రామంలో బుధవారం గుర్రాల పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రామ ప్రజలు అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలో గుర్రాల పోటీలు గ్రామ నాయకుడు దేవాడ దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించినారు. మొదటి విజేతగా రామన్నపాలెం గ్రామానికి చెందిన విక్రమ్ రావడం జరిగింది.15 వేలు నగదు బహుమతి ఇవ్వడం జరిగింది.రెండవ విజేత కోటనందూరు గ్రామానికి రావడం జరిగింది వీరికి 12వేలు నగదు బహుమతి ఇవ్వడం జరిగింది.ఈ గుర్రాల పోటీల నిర్వహణకు నాతవరం గ్రామానికి చెందిన అంకంరెడ్డి లచ్చబాబు లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది.

సముద్రంలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించిన మెరైన్ పోలీసులు

విశాలాంధ్ర - పాయకరావుపేట : మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానం చేస్తుండగా అలల తాకిడి కి కొట్టుకుపోతున్న వ్యక్తిని మెరైన్ పోలీసులు రక్షించారు. మండలంలోని పెదరామభద్రపురం గ్రామానికి చెందిన కోడపల్లి ప్రకాష్(22) తన స్నేహితులు తుంపాల మణికంఠ, మైలవరపు సాయిరాంలతో కలిసి గజపతినగరం సముద్రతీరంలో స్నానం చేస్తుండగా అనుకోకుండా ఎగసిపడిన అలలకు సముద్రంలో కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న మెరైన్ పోలీసులు గజ ఈతగాళ్ళ సహాయంతో ప్రకాష్ ను రక్షించి, ఒడ్డుకు చేర్చి, ప్రథమ చికిత్స చేసి, అనంతరం ఆసుపత్రికి తరలించారు.

మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వపు విద్యార్థులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గొలుగొండ : కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన నర్సి శ్రీను కుటుంబ సభ్యులకు తోటి స్నేహితులు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఎ.ఎల్ పురం ఎస్టీ కాలనీకి చెందిన నర్సి శ్రీను కిడ్నీ వ్యాధి బాధపడుతూ గత నెల 27వ తేదీన మృతి చెందారు. దీంతో 2007 టెన్త్ క్లాస్ బ్యాచ్ కి చెందిన తోటి స్నేహితులు మరణించిన స్నేహితుడు కుటుంబానికి అప్పన్న హస్తం అందించి ఆదుకున్నారు. నర్సి శ్రీను తల్లిదండ్రులు నరసయ్య వెంకన్న చిన్న బుజ్జికి 45 నగదును బుధవారం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు దీంతో శ్రీను కుటుంబ సభ్యులు వీరికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

జనసంద్రమైన రేవుపోలవరం తీరం

- సుమారు లక్ష మంది పుణ్యస్నానాలు
- పుణ్య స్నానం ఆచరించిన హోంమంత్రి అనిత

విశాలాంధ్ర-యస్.రాయవరం : మాఘ పౌర్ణమి సందర్భంగా కొత్త రేవు పోలవరం, రేవు పోలవరం తీరం భక్తులతో జనసంద్రమైనది మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా బుధవారం తెల్లవారుజామున నుంచి భక్తులు నర్సీపట్నం గొలుగొండ ,కోటవురట్ల, నక్కపల్లి, ఎలమంచిలి తదితర ప్రాంతాల నుంచి వచ్చి సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించి లక్ష్మి మాధవస్వామిని దర్శించుకున్నారు. స్నానాలు చేసిన మహిళా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారుల ఆధ్వర్యంలో సత్యసాయి సేవా సమితి వారు ప్రత్యేక టెంట్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తులు రాక మొదలవడంతో అడ్డరోడ్డు నుంచి రేవు పోలవరం వరకు భక్తులతో రోడ్డు అంతా కిటకిటలాడింది. వచ్చిన భక్తులు తీర్థంలోని తిండి సామాన్లు పలు వస్తువులను కొనుగోలు చేశారు. అధికారుల అంచనాల ప్రకారంగా సుమారు లక్ష మంది వచ్చి ఉండొచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వైద్య శిబిరము గజ ఈతగాళ్ల మంచినీరు పంపిణీ ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సమితి ముసలమ్మ ట్రస్ట్, యువజన సంఘాలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ

మంచినీరు పంపిణీ చేశారు. సముద్రం తీరంలో దంపతులకు పురోహితులు బ్రహ్మముడి పూజ వంటి కార్యక్రమాలు చేశారు. అడ్డరోడ్డు నుంచి రేవు పోలవరంకు నర్సీపట్నం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బస్ సర్వీసులు నడిపారు.

భారీ బందోబస్తు : నర్సీపట్నం డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్ర తీరంలోని ఎటువంటి సంఘటనలు జరగకుండా డ్రోన్, సిసి కెమెరా లతో నిఘా పెట్టారు మెరైన్ పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది గజ ఈతగాళ్ళ కు ఎప్పటికప్పుడు డి.ఎస్.పి సూచన చేశారు.

పుణ్య స్థానాన్ని ఆచరించిన హోంమంత్రి అనిత : పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సముద్రంలోని స్నానం ఆచరించేందుకు వచ్చిన సందర్భంగా ముందుగా సూర్య నమస్కారములు చేసి స్థానాన్ని ఆచరించడం జరిగింది. కొండపై ఉన్న లక్ష్మీ మాధవస్వామి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆమెని ఆశీర్వదించారు. మాజీ ఎంపీ టీటీడీ మాజీ చైర్మన్ పప్పల చలపతిరావు తన కుటుంబ సభ్యులతో సముద్ర స్నానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, స్థానిక సర్పంచ్ మల్లే లోవరాజు ,టిడిపి సీనియర్ నాయకులు ఎస్. వెంకటరాజు, కొప్పిశెట్టి వెంకటేష్, గుర్రం రామకృష్ణ ,జానకి శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి, కోవిరి బంగారి, కోడ లోవరాజు ,అడవి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి, శిశు మరణలు సంభవిస్తే కఠిన చర్యలు

ప్రసూతి కేసులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయవద్దు

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ హెచ్చరిక

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : ఇక నుంచీ జిల్లాలో ఒక్క ప్రసూతి, శిశు మరణలు సంభవించినా, ప్రసూతి కేసులను ఇతర ఆసుపత్రి లకు రిఫర్ చేసిన సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ హెచ్చరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రసూతి, ప్రసూతి మరియు శిశు మరణాల కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. జూలై నుండి డిసెంబర్ వరకు జిల్లాలో ప్రసూతి తల్లుల మారణాలు, నావజాత శిశు మరణాలు సంభవించగా, వాటిపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా మరణాలకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ, ఇకనుంచి జిల్లాలో ఒక్క ప్రసూతి, శిశు మరణం కూడా సంభవించదానికి వీల్లేదని స్పష్టం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడాలని, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. మరణాల తరువాత సమీక్షించడం కంటే, వాటిని సంభవించకుండా అరికట్టడమే మనకు అత్యంత ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. ప్రయివేటు ఆసుపత్రి వాళ్ళు చికిత్స చేయగాల సమర్థం ఉంటేనే చికిత్స చెయ్యాల్లన్నారు లేని యెడల వెంటనే చికిత్స లభించే ఆసుపత్రి లకు తరలించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఏమరుపాటుగా ఉన్నా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చంచారు.ఇంత యంత్రాంగం ఉండికూడా మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, అంగన్‌వాడీలు ఉండికూడా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. జరుగుతున్న మరణాల్లో 90శాతం వరకు అరికట్టదగినవేనని ఆమె స్పష్టం చేశారు. ఇకనుంచీ ఎక్కడైనా ప్రసూతి, శిశు మరణం సంభవిస్తే, సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోనని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో డి.ఎం.అండ్. హెచ్.ఒ.డాక్టర్ పి రవి కుమార్, డి.సి.హెచ్.ఎస్ డా.ఎస్. శ్రీనివాస రావు, డి.ఐ.ఓ డా, చంద్ర శేఖర్, డి.పి .హెచ్.ఎన్.ఓ.నాగమణి, ఎన్ టి ఆర్ ఆసుపత్రి డాక్టర్లు, సి .హెచ్.సి, పి.హెచ్.సి., మెడికల్ ఆఫీసర్లు, ఎ.ఎన్ .ఎమ్.లు, ఆశ వర్కర్లు, ఎమ్.ఎల్.హెచ్.పి.లు, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తాం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె. సీతారామరాజు

విశాలాంధ్ర-సబ్బవరం : పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.సీతారామరాజు స్పష్టం చేశారు. రాయపూర్- విశాఖపట్నం ఎక్స్ప్రెస్ హైవే జాతీయ రహదారి 130 నిర్మాణంలో మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ సబ్బవరం పెదనాయుడు చెరువు భూ గర్భం సుమారు రెండున్నర ఎకరాలు విలీనం కావడంతో ఆయుకట్టు రైతులు తమ పంట పొలాలకు సాగునీరు చాలదని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో చెరువు ఆయకట్టు రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామరాజు, హైవే ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్, జాతీయ రహదారి సైట్ ఇంజనీర్ పవన్, కాంట్రాక్టర్ సైట్ ఇంజనీర్ రామకృష్ణ,స్థానిక ఇరిగేషన్ ఏఈ సాయి కిరణ్ రైతులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామరాజు మాట్లాడుతూ నాయుడు చెరువు ఆయుకట్టు రైతుల డిమాండ్లను పరిష్కరించి, హైవేలో విలీనమైన పెదనాయుడు చెరువు భూగర్భం సుమారు రెండున్నర ఎకరాలు భూమికి బదులుగా ప్రైవేట్ భూమిని సేకరించి చెరువులో కలుపుతామని హామీ ఇచ్చారు. అలాగే నాయుడు చెరువు అలుగు నీరు బొర్రమ్మ గెడ్డకు తరలిపోయేటట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పోతురాజు చెరువు నుండి వచ్చే అలుగునీరు బొర్రమ్మ గెడ్డకు మళ్ళిస్తామని అన్నారు. రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని అయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్టును ప్రజల సహకారంతో పూర్తి చేయాలని అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కోటాన అప్పారావు ఆయుకట్టు రైతులు తరపున తమ సమస్యల వినత పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆదిరెడ్డి పోతరాజు, సబ్బవరపు కృష్ణ, కొటాన అప్పల శ్రీరామ్, వెన్నెల సన్నిబాబు, సబ్బవరపు నాగేంద్ర, ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి వద్ద భార్య ధర్నా: న్యాయం చేస్తామని పోలీసులు హామీ

విశాలాంధ్ర-కే.కోటపాడు : ప్రేమించి, పెళ్లి చేసుకుని కొన్నాళ్లు కాపురం చేసి తన కుటుంబ సభ్యులకు ఈ పెళ్లి ఇష్టం లేదని చెప్పి మొఖం చాటేసుకొని తిరుగుతున్న వరుడు ఇంటి వద్ద పెళ్లి కుమార్తె ధర్నా చేసిన సంఘటన ఇక్కడ జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ మండలం రొంగల నాయుడుపాలెం గ్రామానికి చెందిన గుదే సురేష్ విశాఖపట్నం మధురవాడ ప్రాంతానికి చెందిన కాశీ స్వాతి ఇద్దరు కృష్ణ డిగ్రీ కాలేజీలో కలసి చదువుకునేవారు. చదువుకునే రోజుల నుండే ఇరువురు ప్రేమించుకుని కొన్నాళ్ల తర్వాత మధురవాడ రిజిస్టర్ కార్యాలయంలో పెళ్లి చేసుకున్నారు. అక్కడే ఒక ఇల్లు అద్దెకు తీసుకొని కొద్దికాలం కాపురం చేశారు. గత సంవత్సరం అక్టోబర్ 9న ఇంటికి వెళ్తానని చెప్పి సురేష్ తిరిగి రాలేదు. తన కుటుంబ సభ్యులకి ఈ పెళ్లి ఇష్టం లేదని తన తల్లిదండ్రులు ను ఒప్పించుకుని వస్తానని అప్పటివరకు వేచి ఉండాలని ఫోన్లో చెబుతుండేవాడు. కొద్దికాలం తర్వాత ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేయడంతో స్వాతి ఇల్లు ఖాళీ చేసి తన కన్నవారింటికి చేరింది. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక సిఐటీయు నాయకులను స్వాతి కోరింది. బుధవారం స్వాతిని వెంటబెట్టుకొని రొంగలినాయుడు పాలెం సురేష్ ఇంటికి చేరుకున్నారు. స్వాతికి న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ కొద్దిసేపు ధర్నా చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులను విడగొట్టడం న్యాయం కాదని వారిద్దరినీ ఒకటి చేయడానికి సహకరించాలని సురేష్ తండ్రి కొండబాబును సిఐటీయు నాయకులు కోరారు. తన ఇంటి వద్ద ధర్నా చేసి ఇబ్బంది కలిగిస్తున్నారని కొండబాబు కె. కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాతికి న్యాయం జరిగే వరకూ తాము వదిలిపెట్టేది లేదని సిఐటి నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు నాయకులు రాజ్ కుమార్ గండి నాయన బాబు ఎర్ర దేవుడు స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వియస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు ప్రారంభం

- పేద ప్రజల వైద్యం కోసం ఉచిత బస్సు ఏర్పాటు
- చైర్మన్ డాక్టర్ వడ్డీ సత్యారావు

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్డి సత్యారావు ఆధ్వర్యంలో బుధవారం రావికమతం నుండి తగరపువలస ఎన్ఆర్ఐ అనిల్ నిరుకొండ హాస్పిటల్ కు పేదప్రజల వైద్యంకోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన 30 ప్రజలు పేసెంట్ ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ ఉచిత వైద్య సేవలు పొందడానికి వచ్చిన వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సౌకర్యం కల్పించారు. ఇక్కడ కు వచ్చిన వారికి 3 కంటి, గైనిక్ 3, ఆర్థో 3, ఈఎన్టీ 2, జనరల్ ట్రీట్మెంట్ 7 గురు కి ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎప్పుడు చేసే అన్నదానమే కాకుండా ఉచిత వైద్య సేవలు కూడా ప్రారంభించారు. ప్రతి బుధవారం ఈ ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ వడ్డీ సత్యారావు తెలిపారు. ఈ వైద్య సేవలు పొందడానికి వచ్చే వారు తప్పకుండా

ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకురావలని ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలందరూ కూడా వినియోగించు కోవాలని సత్యరావు కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటియుసి

విశాలాంధ్ర-యలమంచిలి : మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి గని శెట్టి ఏసుదాసు కోరారు. బుధవారం ఉదయం మున్సిపల్ వర్కర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశంలో యేసుదాసు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా మున్సిపల్ కార్మికుల సమస్యలను తీర్చడంలో విఫలమవుతున్నారని గత ప్రభుత్వం కూడా హామీలు నెరవేర్చేందుకు ముందుకు వచ్చిన చివరి వరకు ఒక్కటి నెరవేర్చలేక చేతులు విదేసిందని, ఈ ప్రభుత్వంలోనైనా తమ హామీలను నెరవేర్చి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, వెంకటరమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్త జనసంద్రం... పూడిమడక సముద్రతీరం

మాఘ స్నానాలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-అచ్యుతాపురం : పూడిమడక సముద్రతీరం మాఘ స్నానాలకు వచ్చే భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా తీరంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి 12 గంటల తరువాత నుండి భక్తులు సముద్రంలో అరటిపళ్ళు , నాణేలు వేసి స్నానాలు చేశారు . అనంతరం తీరంలో ఉన్న జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. భక్తులు సాయంత్రం 7 గంటల వరకు స్నానాలకు వస్తూనే ఉన్నారు . భక్తులకు ఇబ్బందులు కలగకుండా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు . అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు ఉచిత వైద్యం ఏర్పాటు చేశారు . పోలీసులు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి సముద్ర స్నానాలు ఆచరించే సమయంలో తగు సూచనలు ఇస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు .

పాయకరావుపేట : మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని సముద్రం తీరం భక్తులతో కిటకిటలాడింది. సముద్ర స్నానాలు ఆచరించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెంటకోట, గ౯జపతినగ౯రం, వెంకటనగరం, పాల్మాన్ పేట తదితర సముద్ర తీరాలలో భక్తులు సముద్ర స్థానాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

రాంబిల్లి : మండలంలోగల సముద్ర తీర ప్రాంతాలైన వాడ రాంబిల్లి, వెంకయ్యపాలెం, లోవపాలెం గ్రామాలలో గల సముద్ర తీర ప్రాంతంలో బుధవారం మాఘ పూర్ణిమ సందర్భంగా వేలాది మంది భక్తులు స్నానాలు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమీప గ్రామాల నుండి వేల సంఖ్యలో భక్తజనం తరలివచ్చి స్నానాలాచరించి,సమీపంలో ఉన్న దేవాలయాలలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు.సిఐ నర్సింహారావు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తుతో పోలీసు సిబ్బంది,మత్స్యకార వాలంటీర్లు భక్తులకు నిర్దేశించిన ప్రదేశం కంటే లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రమాదవశాత్తు నేల బావిలో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-యస్.రాయవరం : ఎస్ .రాయవరం సమీపంలో ఒక కొబ్బరి తోట వద్ద నేలబావిలోని ప్రమాదవశాత్తు కాలుజారి మృతి చెందిన సంఘటన జరిగింది స్థానిక ఎస్సై ఏ. విభూషణరావు అందించిన వివరాలు ప్రకారంగా ఎస్ .రాయవరం గ్రామానికి చెందిన కొబ్బరికాయలు వ్యాపారి అరిగల శ్రీనివాసరావు (54)అనే వ్యక్తి తన కుమారుడు రాజేష్ తో ఉదయం 6:30 గంటల సమయంలో పొలంలో పని నిమిత్తం కలిసి వెళ్లిన శ్రీనివాసరావు పని ముగించుకొని దగ్గర్లో ఉన్న బావి వద్దకు మొఖం కడుక్కొని వస్తానని కుమారుడుకు చెప్పాడు. అదే సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోవడంతో చూసిన కుమారుడు పెద్ద కేకలు వెయ్యడం చుట్టుపక్కల వారిని పిలవడంతో అప్పటికే ఈత రాక బావిలో మునిగిపోయిన శ్రీనివాసరావు బయటికి తీసేసరికి చనిపోయాడని గుర్తించారన్నారు. కుటుంబ సభ్యులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ముప్పై పడకల హాస్పిటల్ కి తరలించడం జరిగిందని ఎస్సై వెల్లడించారు.

తూనికల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

తూనికలు కొలతలు శాఖ అధికారి అనురాధ

విశాలాంధ్ర-గొలుగొండ : వ్యాపారులు తూనికల్లో మోసాలకు పాల్పడినట్లయితే అటువంటి వ్యక్తులపై కేసులను నమోదు చేయడం తప్పదని నర్సీపట్నం తూనికలు కొలతలు శాఖ అధికారి అనురాధ తెలిపారు. బుధవారం గొలుగొండ మండలం జోగంపేటలో కిరాణా షాపుల్లో తూనికలు కొలతలు శాఖ అధికారి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూనికల్లో కొలతల్లో ఎవరు మోసగా పాల్పడిందని అలాగే కాటాలను ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు అధికారుల వద్ద చెక్ చేయించుకోవాలని తెలిపారు. ఎవరు మోసాలకు పాల్పడిన అటువంటి వ్యక్తులపై కేసులు నమోదు చేయడం తప్పదని హెచ్చరించారు.

శభాష్ పోలీస్... అంటున్న భక్తులు

విశాలాంధ్ర-అచ్యుతాపురం : పూడిమడక మావిపౌర్ణమి జాతర, పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో భక్తుల పట్ల చూపిన శ్రద్ధపై పోలీసులు అందరి చేత శభాష్ పోలీస్ అనిపించుకున్నారు. తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను చేరదీసి జాగ్రత్తగా వాళ్ళ తల్లిదండ్రులకు అప్పగించారు. సముద్ర స్నానం చేస్తుండగా ఫిట్స్ వచ్చిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి హాస్పిటల్‌కి పంపించారు. సముద్ర స్నానం చేసి ఆంజనేయస్వామి గుడి వద్ద స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తిని వెంటనే పోలీస్ ఎస్కార్ట్‌లో హాస్పిటల్‌కి పంపించారు. సముద్ర స్నానానికి వచ్చిన భక్తులపై పోలీసులు చూపిన శ్రద్ధపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మేలు

విశాలాంధ్ర-వి. మాడుగుల : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. బుధవారం ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, పప్పుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా కేవలం ప్రకృతి వ్యవసాయంతోనే వీటిని పండిస్తున్నామని ప్రతీ ఒక్కరూ ఈ ఆకుకూరలు కూరగాయలు వాడటం ద్వారా శరీరానికి ఎంతో మేలు జరుగుతుందని సిబ్బంది తెలిపారు. ప్రతీ బుధవారం ఇదే ప్రాంతంలో కూరగాయలు పెడుతున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బి.దేవి, యూనిట్ ఇన్‌చార్జ్ గండి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సుజాత, సన్యాసిరావు, చిరంజీవినాయుడు, రాధ, పార్వతీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి పార్టీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-నక్కపల్లి : నక్కపల్లి పట్టణంలోని మండల కేంద్రానికి సంబంధించిన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టిడిపి పార్టీ కార్యాలయాన్ని టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా వేదమంత్రాలు నడుమ ప్రారంభించారు. ముందుగా పార్టీ జెండాని కార్యాలయావరణంలో ఆమె చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కొప్పిశెట్టి వెంకటేష్ దంపతులు హేమ కుటుంబ సభ్యులు కలిసి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీ బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్న సర్పంచ్ గండి అరుణ

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామ ప్రజలు ఆరాధ్య దైవమైన శ్రీ బండిమాంబ అమ్మవారి రెండు రోజుల తీర్థ మహెూత్సవం సందర్భంగా మొదట రోజు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గండి అరుణ, యువ నాయకులు గండి వంశీ దీప్, సీనియర్ నాయకులు తమరాన బంగారు నాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి గ్రామ ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి సుమారు 3000 మందికి భారీ అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలలో అంగటి నానాజీ, నెక్కల శ్రీను, గండి దేవుళ్ళు, లైన్మెన్ నాయుడు, బైలపూడి రాంబాబు, రాళ్లపల్లి బండయ్య, సింగంపల్లి అప్పలనాయుడు, మేడపాటి రాము, వెన్నెల శంకర్,గురి బండయ్య ,గురి నాయుడు, బైలపూడి తులసి ,గురి సత్యవతి మొదలగువారు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం

వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర-మునగపాక : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన మునగపాకలో బొడ్డేడ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఏదైతే మద్యం ధరలు పెంచమని చెప్పారో కూటమి నేతలు కానీ ఇప్పుడు దానికి విరుద్ధంగా మద్యం ధరలను ప్రతి బాటిల్ పై 20 రూపాయలు పెంచడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వాన్ని ఎన్నిరకాలు మాట్లాడారు. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్నది ఏమిటి అని ప్రశ్నించారు. అలాగే గత ప్రభుత్వంలో వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసేవారని కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీధి వీధికి మద్యం దుకాణాలు విచ్చలవిడిగా చలామణి చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా మద్యం దుకాణాలు దగ్గర కాకుండా వీధి వీధికి మద్యం దుకాణాల దగ్గర క్వార్టర్ బాటిల్ పై అదనంగా 50 రూపాయలకు అదనంగా వేసుకొని అమ్మకం చేస్తున్నారని అన్నారు. మద్యం దుకాణాలపై ఎక్సైంజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎటువంటి చర్యలు తీసుకోకుండా అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నరాలశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ విజయ్ కృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : జిల్లా ఆసుపత్రి లో నిర్మాణం లో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా ఆసుపత్రి ని ఆమె తనిఖీ చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించి, జరుగుతున్న నిర్మాణ పనులు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లా ఆసుపత్రి లో జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. పనులు పురోగతి పై అధికారులకు సూచనలు, అదేశాలు జారీ చేశారు. నిధులకు ఇబ్బంది లేదని, వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తి చేయాలని కాంట్రాక్టర్ లకు తెలిపారు. ఆసుపత్రి సమావేశ మందిరం లో డాక్టర్స్, సిబ్బంది తో నిర్వహించిన సమావేశం లో జిల్లా కలెక్టర్ ఆసుపత్రి లో గల సదుపాయాలు, మెరుగైన సేవలు అందించుటకు కావలసిన సదుపాయాలు గూర్చి, బ్లాక్ లలో ఇబ్బందులు గురించి బ్లాక్ వారిగా డాక్టర్స్ ను అడిగి తెలుసు కున్నారు. సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఆసుపత్రి లో అన్ని రకాల వైద్య సేవలు అందించాలని తెలిపారు. కేసులను యితర ఆసుపత్రి లకు రిఫర్ చేయకూడదన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించుటకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. రవికుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

చిక్కాల యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-పాయకరావుపేట : మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని పెంటకోట సముద్ర తీరం వద్ద సముద్ర స్నానానికి వచ్చిన భక్తులకు చిక్కాల యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. సుమారు పదివేల మందికి పంపిణీ చేసినట్లు యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేపల తాతాజీ, బొలిశెట్టి శ్రీను, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డిఎస్ఎన్ఎల్‌యులో మహిళా హక్కుల అవగాహన సదస్సు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలం యొక్క న్యాయ సేవ కేంద్రం సభ్యులు ఆధ్వర్యంలో మహిళా హక్కుల అవగాహన సదస్సును ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వైవిధ్య భరితమైన నాటక ప్రదర్శనలతో మహిళా హక్కుల పై వినూతనంగా అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో డా.కె.సుధా మాట్లాడుతూ ఆడవారి పై చాలా పెద్ద బాధ్యత ఉంటుంది. తమ పిల్లలను తమ కాళ్ళ మీద తాము నిలబడేలాగా తీర్చిదిద్దాలని, ఆడ పిల్లలకు ఏసమస్యను అన్న ఎదుర్కొన ధైర్యం అందివ్వాలని తెలియజేసారు. డీఎస్ఎన్ఎల్ యు ఉపకులపతి డా. సూర్యప్రకాశరావు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ లతా, న్యాయ సేవా కేంద్రం ఉపాధ్యాయ సభ్యులు డా.సి.హెచ్. లక్ష్మి, డా.భావనేశ్వరి పాల్గొన్నారు.

ఉచిత ఫలహారం పంపిణీ

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఫలహార పంపిణీ చేశారు. రేవు పోలవరం మాఘ పౌర్ణమి జాతరకు వచ్చే భక్తులకు ఫలహార తో పాటు మంచి నీరు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో ఘనంగా మహా మాఘి ఉత్సవాలు

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని దేవిపురంలో శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో మాఘ పౌర్ణమి పురస్కరించుకొని గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా మహా మాఘీ ఉత్సవాలు నిర్వహించారు. శ్రీ మేరు అందలి ఖడ్గ మాలా దేవతహాల ప్రతిష్ట జరిగి నేటికి 31 వసంతాలు పూర్తయినాయి. బుధవారం ఉదయం గోమాతల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. గురుమాత అనుజ్ఞ ప్రకారం వేదమంత్రాల నడుమ దేశ విదేశీ భక్తులందరూ కలిసి 108 పవిత్ర కలశాలను శ్రీ మాత్రే నమహా అన్న శరణు ఘోషతో శ్రీమేరు, గణపతి ఆలయాల పురవీధులగుండా ఊరేగింపుగా తెచ్చి ఖడ్గమాలా దేవతల వద్ద ఒక్కొక్కటి ఉంచారు. 9వ ఆవరణ కేంద్ర బిందువు లోనున్న సహస్రాక్షి అమ్మవారికి, భూపురం వరకు ఉన్న మిగిలిన ఆవరణలలోని దేవతలకు ఒకేసారి వేద మంత్రాలతో, కళావాహస, లలితా సహస్ర నామం, ఖడ్గ మాలా స్తోత్రాలతో పూజించి, పవిత్ర ప్రయాగ రాజ్ మహా కుంభ మేళా నుండి ఇటీవల తెచ్చిన పవిత్ర గంగా జలాలతో ఏక కాలంలో అభిషేకించారు. దేశ విదేశీ భక్తులు (ఆస్ట్రేలియా నుండి డేవిడ్, గ్రేస్‌బీ అకిహికో - జపాన్ నుండి, మాగ్దలీనా, అలెగ్జాంద్రా.. ఆస్టియా నుండి, లోయెల్లా %ఖఖ% నుండి) ఇందులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గురుమాత శ్రీమతి అన్నపూర్ణమ్మ ఆహుతుల్లందరినీ దీవించి లడ్డు ప్రసాదం అన్నదానం అందించి దీవించారు . ఈ పూజా కార్యక్రమాలు దేవిపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలకై రిజిస్ట్రేషన్ తప్పనిసరి

-రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన ఏవో సుమంత



విశాలాంధ్ర-రాంబిల్లి : భూమి వున్న ప్రతి రైతు కూడా ఆయా రైతుసేవా కేంద్రాలలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుమంత అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె రైతులతో మాట్లా డుతూ రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్రతీ రైతుకు 12 అంకెలు గల విశిష్ట సంఖ్య వస్తుందని,తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వారు ఇచ్చే పీఎం కిసాన్ , అన్నదాత సుఖీభవ ,పంటల బీమా,కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పంట ఋణాలు,పంట నష్టం, సబ్సిడీ పై యంత్ర పరికరాలు వంటి పథకాలు అన్నీ పొందడానికి అర్హులవుతారని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కోసమై రైతులు వచ్చేటప్పుడు తమతో పాటు ఆధార్ కార్డు,ఆధార్ కి లింక్ అయిన మొబైల్ ఫోన్ (తప్పని సరిగా తీసుకురావాలి),భూమి పాస్ పుస్తకం లేదా 1 బి,అదేవిధంగా రబీ ఈ పంట నమోదు చేసుకున్న రైతులందరూ రైతుసేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ఈనెల 20వ తేదీలోగా తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలని సూచించారు.

ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర-సబ్బవరం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏరైతు రిజిస్ట్రీలి లో రైతుల వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహన్‌రావు సూచించారు. మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో బుధవారం సచివాలయంలో జరుగుతున్న రైతుల నమోదు కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలోని రైతులందరూ నమోదు చేసుకోవడం వల్ల వారికి ఆధార్ తరహాలోనే ఒక ప్రత్యేక నెంబర్ అనేది ఇవ్వడం జరుగుతుందని, దీనివలన తదుపరి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పిఎం కిసాన్ భరోసా సాయం గాని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల కొరకు చేపట్టే వివిధ రకాల సంక్షేమ పథకాలు కూడా పొందడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. అన్ని గ్రామాల్లోని రైతులను నమోదయ్యేటట్టు చూడాలని గ్రామ వ్యవసాయ గ్రామ వ్యవసాయ సహాయకులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బంగారు పాలెం గ్రామ సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

చోడవరంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-చోడవరం : అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో చోడవరం శివాలయం అర్చకులు కొడమంచలి చలపతిరావు ఆధ్యర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. ఈ శిబిరం లో 73 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా, వారిలో 15 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. మరియు కంటి నరాలు చికిత్స కోసం 1, కంటి పై పొర చికిత్స కోసం 2, కంటి నీటి కాసుల చికిత్స కోసం 1, కంటి రెప్పల చికిత్స కోసం 1, మరియు చిన్నపిల్లల కంటి చికిత్స కోసం 1, వీరిని ప్రత్యేకంగా మా వద్ద ఉన్న స్పెషల్లిస్టులు (ప్రముఖ డాక్టర్లు) చే ఆసుపత్రిలో చికిత్స చేయుటకు ఈ శిబిరం నుండి విశాఖ లోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కొడమంచాలి చలపతిరావు, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ హరి చందన, క్యాంపు మేనేజర్ ఎం. అరుణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకుడు రాంబాబు కుటుంబాన్ని గండి రవికుమార్ పరామర్శ

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని గొటివాడ పంచాయతీ వైసిపి సీనియర్ నాయకుడు దువ్వూరి రాంబాబు మేనత్త కనకమమ్మ ఇటావలి మృతి చెందింది. ఆ విషయం తెలుసుకోని పెందుర్తి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గండి రవికుమార్ బుధవారం ఉదయం వైస్సార్సీపీ సీనియర్ నాయకులు దువ్వూరి రాంబాబు ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి అనంతరం ఆ భగవంతుడు ఆయనకు ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఆయనతో గొటివాడ గ్రామ ఉప సర్పంచ్ దుర్గా ప్రసాద్ , వైస్సార్సీపీ నాయకులు విరోతి రామారావు ,లగిశెట్టి కుమార్ . కర్రీ బాబు, యడ్ల నాయుడు , ఉప సర్పంచ్ సిరపరపు వాసు , వైస్సార్సీపీ కార్యకర్తలు గండి రవికుమార్ యువ సైన్యం ఉన్నారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి

విశాలాంధ్ర-సబ్బవరం : సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్ లో గల సెప్టిక్ ట్యాంక్ ను వెంటనే క్లీన్ చేసి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని, పలువురు ప్రయాణికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించి సుమారు 35 సంవత్సరాలు కావస్తున్న ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల మరుగుదొడ్లకు నిర్మించిన సెప్టిక్ ట్యాంక్ ను ఇంతవరకు ఆర్టీసీ అధికారులు క్లీన్ చేయలేకపోవడంతో సెప్టిక్ ట్యాంక్ నిండి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఆర్టిసి అధికారులు దీనిపై దర్యాప్తు చేసి, సెప్టిక్ ట్యాంకు క్లీన్ చేసి ప్రయాణికులకు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఇటీవల సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్ కు ప్రయాణికుల తాకిడి అధికం కావడంతో మహిళలకు, వృద్ధులకు, విద్యార్థులకు మరుగుదొడ్లు ఆవశ్యకత ఏర్పడింది. అధికారులు దీనిని దృష్టిలో ఉంచుకొని సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.